నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 5 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

భక్తిశ్రద్ధలతో నరేంద్ర ఆచార్య పాదుకల దర్శనం

నరేంద్ర ఆచార్య పాదుకలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కౌటాల, జనవరి 4 : మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో గురువారం శ్రీ నరేంద్ర ఆచార్య పాదుకల దర్శనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్కెట్ ఏరియా నుంచి మినీ స్టేడియం వరకు పాదుకలను సంప్రదాయ వాయిద్యాలు, మహిళల నృత్యాల నడుమ ఊరేగించారు. మహారాష్ట్రలోని నానిజ్ దాం నుంచి తీసుకువచ్చిన పాదుకలకు పూజలు చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రెఫరీల ఎంపిక

కుమ్మరి మల్లేశ్

ఆర్.శ్రీనివాసరెడ్డి

ఆర్.రామకృష్ణారెడ్డి

రెబ్బెన, జనవరి 4 : గడ్చిరోలిలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు రెఫరీలు ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోలేటి గ్రామానికి చెందిన సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కుమ్మరి మల్లేశ్, ఆర్.శ్రీనివాసరెడ్డి, ఆర్,రామకృష్ణారెడ్డి జాతీయ స్థాయి పోటీలకు రెఫరీలుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. వీరిని ఉమ్మడి ఆదిలాబాద్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, అధ్యక్షుడు నర్సింగం, సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, టాగ్ ఆఫ్ వార్ సెక్రటరీ భాస్కర్, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ గోలేటి అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణ్, సాంబయ్య, సదానందం, లింగరెడ్డి, హరిలాల్, గుజ్జ మల్లేశ్, సతీశ్, తౌఫీక్, రెడ్డి సతీశ్, చిన్ని అభినందించారు.

ఆలయంలో పూజలందుకుంటున్న భీమ దేవుడు

వైభవంగా భీమదేవుని వేడుకలు

కెరమెరి, జనవరి 4 : మండలంలోని కొలాం ఝరి గ్రామంలో ఆదివాసీలు భీమదేవుని వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. వారం రోజులుగా ఉత్సవాలు కొనసాగుతుండగా, గురువారం ఆఖరి రోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం సాయంత్రం భీమదేవునికి స్నానాలు చేయించి మహాపూజ నిర్వహించిన సిడాం వంశీయులు గురువారం ఉదయం నుంచి సాయంత్ర వరకు సంప్రదాయ వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. అక్కడే వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

ఆలయ ప్రాంగణంలో నృత్యం చేస్తున్న మహిళలు

వేగంగా ఆయిల్‌పామ్ విస్తరణ

ఆసిఫాబాద్ జిల్లాలో 3 వేల ఎకరాలు అనుకూలం

- మార్చికల్లా 1048 ఎకరాల్లో పెంచాలని లక్ష్యం
- ఇప్పటికే 129 ఎకరాల్లో సాగు
- సబ్సిడీపై మొక్కలు, డ్రిప్‌లు
- ఒక్కసారి వేస్తే.. 30 ఏళ్లపాటు ఆదాయం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : ఆయిల్‌పామ్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో జిల్లాలో సాగు విస్తీర్ణం వేగంగా పెంచేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతున్నది. ప్రాథమిక సర్వేలో 3 వేల ఎకరాలు సాగుకు అనుకూలమున్నట్లు గుర్తించగా, విడుతల వారీగా పంటను విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించి ముందుకెళ్తున్నది.

మార్చికల్లా 1048 ఎకరాల్లో..

జిల్లాలో ఆయిల్‌పామ్‌ల విస్తరణ వేగంగా సాగుతున్నది. ఈ ఏడాది మార్చికల్లా 1048 ఎకరాల్లో పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు.. ఆ దిశగా చర్యలను వేగవంతం చేశారు. ఇప్పటికే 23 మంది రైతుల చేతుల మీదుగా 129 ఎకరాల్లో సాగు చేయిస్తున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో వంద శాతం టార్గెట్‌ను పూర్తిచేయాల్సి ఉండగా, సాధ్యం కాలేదు. దీంతో మార్చిలోగా 100 శాతం పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

సబ్సిడీపై డ్రిప్‌లు.. మొక్కలు

రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించే దిశగా కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలో ఆయిల్ పామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించింది. ఈ మేరకు జిల్లాలో మ్యాట్రిక్స్ అనే ప్రైవేటు కంపెనీకి అధికారులు బాధ్యతలు అప్పగించారు. ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులకు మొక్కలను సరఫరా చేసేందుకు మంచిర్యాల జిల్లాలోని భీమారంలో ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి రైతులకు మొక్కలను అందిస్తున్నారు. ఒక్కో మొక్క ఖరీదు రూ.213 ఉండగా, రూ. 193 సబ్సిడీ ఇస్తున్నారు. మిగతా డబ్బులు రైతులు తమ వాటాకింద చెల్లిస్తున్నారు. ఆయిల్ పామ్ పెంచేందుకు ముందుకు వచ్చే రైతులకు సబ్సిడీపై డ్రిప్‌లను అమలు చేస్తున్నది. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ ఇస్తుండగా, ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీ అందిస్తూ ప్రోత్సహిస్తున్నది. ఇక నాలుగేళ్లపాటు ఎకరానికి రూ. 2 వేల విలువైన ఎరువులు సరఫరా చేస్తున్నారు. రైతులు మొక్కలు నాటిన నాలుగో యేట నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. దాదాపు 30 ఏళ్లపాటు రైతులకు ఆదాయం వస్తూనే ఉంటుంది.

పులికుంటలో ఆయిల్ పామ్ తోట

శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

శ్రీరాముని అక్షింతలతో శోభాయాత్ర

మంచిర్యాలటౌన్, జనవరి 4: మంచిర్యాల పట్టణంలోని 16వ వార్డు అశోక్‌రోడ్డు, సెవెన్‌హిల్స్ కాలనీ, భగవంతంవాడ, లక్ష్మీనగర్‌లో గురువారం అయోధ్య శ్రీరామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరాముని అక్షింతలు, కలశంతో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి శ్రీరాముని అక్షింతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్, ట్రస్టు సభ్యుడు బోరిగం శ్రీనివాస్, కర్ణకంటి రవీందర్, రామగిరి శ్రీనివాస్, ఎడ్ల రవి, ప్రభాకర్, సోమ ప్రదీప్‌చంద్ర, రాంచందర్, ఆంజనేయులు, సతీష్, పడమటింటి శ్రీనివాస్, రామ బ్రహ్మం పాల్గొన్నారు.

దరఖాస్తు కౌంటర్ల వద్ద గుమిగూడిన ప్రజలు

అభయహస్తంపై ఆగమాగం

ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియలో జనం తికమక

- పత్రాలపై అధికారులు స్పష్టత ఇచ్చినా సోషల్ మీడియా సమాచారం పట్టుకొని ఆందోళన
- జిరాక్స్ సెంటర్లకు పరుగులు.. వృథా ఖర్చులు
- వేలకు వేలు చార్జీలు పెట్టుకొని సొంతూళ్లకు..

దండేపల్లి, జనవరి 4 : అభయహస్తం ప్రజాపాలన దరఖాస్తు ప్రక్రియలో జనం వదంతులను నమ్మి ఆగమాగం అవుతున్నారు. ఐదు గ్యారెంటీలకు ఏమేమి పత్రాలు ఇవ్వాలో అధికారుల స్పష్టత ఇచ్చినా.. సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టే సమాచారాన్ని పట్టుకొని ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఫలానా పత్రం లేకుంటే ప్రభుత్వం ఇచ్చే పథకాల కు అనర్హులమవుతామనే భయంతో అన్ని ప త్రాలను జత చేస్తూ.. వృథా ఖర్చులు చేస్తున్నారు.

జిరాక్స్ పత్రాల కోసం ఖర్చు..

ప్రజాపాలన దరఖాస్తులో కేవలం యజమాని ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ పత్రాలు జత చేయాలని అధికారులు సూచించారు. కానీ.. ఇవేవీ పట్టించుకోకుండా అందరి ఆధార్ కార్డులు, గ్యాస్, విద్యుత్ బిల్లు, పట్టాదారు పాసు పుస్తకాలు, ఉపాధిహామీ కార్డులు, ఫించన్ సంబంధించిన పత్రాల జిరాక్స్‌లు జతచేసి అందజేస్తున్నారు. ఒక్కో కుటుంబం జిరాక్స్‌ల కోసం రూ. 100కిపైగా ఖర్చు చేస్తున్నారు. జీపీ సిబ్బంది ఉచితంగా దరఖాస్తు ఫారాలు ఇంటింటికీ తిరిగి అందజేస్తున్నారు. అయితే.. కొందరు ఫారాలు నింపే అవగాహన లేకపోవడంతో దానిని అసంపూర్తిగా నింపేసి మరో ఫారం కోసం జిరాక్స్ సెంటర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. బ్లాక్ అండ్ వైట్ అయితే రూ.20, కలర్ అయితే రూ.50 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

ఎక్కడెక్కడి నుంచో సొంతూళ్లకు..

జీవనోపాధికి ఇతర ప్రాంతాల్లో ఉంటున్న అనేక కుటుంబాలు సొంతూళ్లకు వచ్చి దరఖాస్తులు చేసుకుంటున్నాయి. ఉపాధికోసం హైదరాబాద్, ముంబాయితో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారు కూడా ఇక్కడి పిల్లాపాపలతో వచ్చి దరఖాస్తుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి వారు రావాల్సిన అవసరం లేదు. వివరాలను గ్రామంలో తెలిసిన వారికి ఇచ్చి.. వారితో కూడా దరఖాస్తు చేయించుకునే అవకాశం ఉంది. అయినా అవగాహన లేక వేలకు వేలు బస్సు, ట్రైన్ చార్జీలు పెట్టుకొని దరఖాస్తులు అందిస్తున్నారు.

పొగాకుతో కలిగే నష్టంపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు
- మంచిర్యాల కలెక్టరేట్‌లో పోస్టర్లు విడుదల

మంచిర్యాల ఏసీసీ, జనవరి 4 : పొగాకుతో కలిగే నష్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంచిర్యాల జిల్లా వైద్యాధికారి డా.జీ.సుబ్బారాయుడు అధికారులకు సూచించారు. గురువారం మంచిర్యాల కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పొగాకు అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు పొగాకుకు బానిస అయి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించాలని సూచించారు. పొగాకు వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.విజయ పూర్ణిమ, పీవో డా.అనిత, డీఎస్‌వో డా.ఫాయాజ్, సూపరింటెండెంట్ విశ్వేశ్వరరెడ్డి, సీహెచ్‌వో లింగారెడ్డి, డెమో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు పెరగాలి

మందమర్రి, జనవరి 4 : ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు పేర్కొన్నారు. మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని సేవలు అందుతున్నాయని, నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణులకు ప్రతి నెలా పరీక్షలు చేసి పోషకాహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. గర్భిణులు, చిన్న పిల్లలపై తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణపై ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ పయాజ్ ఖాన్, మండల వైద్యాధికారి డాక్టర్ రమేశ్, సీహెచ్‌వో గంగాధర్, ఎంఎల్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, వైద్యాధికారులు

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్
- గుండ్లసోమారం, చిత్తాపూర్ గ్రామాల సందర్శన

ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నెన్నెల, జనవరి 4 : అర్హులందరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నెన్నెల మండలం గుండ్లసోమారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిత్తాపూర్‌లోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ 5 గ్యారంటీల పథకాల దరఖాస్తుల స్వీకరణ కోసం జిల్లాలో 1,702 కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు నకలు ప్రతి తప్పనిసరిగా జతపరచాలని, రేషన్ కార్డు నకలు ప్రతి లేకున్నా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఆదేశించారు. వార్షిక పరీక్షల ఫలితాల్లో పూర్తి స్థాయిలో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. నెన్నెల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా ప్రవర్తించాలని, వారికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అందుబాటులో ఉంటూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, నెన్నెల మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరలక్ష్మి, నెన్నెల మండల విద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ మోతీలాల్

దండేపల్లి, జనవరి 4 : సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ మోతీలాల్ సూచించారు. దండేపల్లి మండలం నాగసముద్రంలో ప్రజాపాలన కేంద్రాన్ని గురువారం సందర్శించారు. అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. దరఖాస్తు సమర్పణలో తలెత్తుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డులు లేకున్నా ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కన్నెపల్లి, గూడెం, లక్ష్మీకాంతాపూర్ గ్రామాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగరాణి, మండల ప్రత్యేకాధికారి స్వామిరెడ్డి, ఎంపీడీవో మల్లేశ్, డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఆర్ఐలు చంద్రమౌళి, భూమన్న, ఎంపీవో శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు అనవేణి ప్రేమళ, గడికొప్పుల రజిని, బాదినేని సత్యావతి, వ్యవసాయాధికారి అంజిత్‌కుమార్, జీపీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగసముద్రంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

దిలావర్‌పూర్‌లోని జాతీయ రహదారి పక్కన దీక్ష చేస్తున్న రైతులు, నాయకులు

ఇథనాల్ రగడ

పరిశ్రమను ఏర్పాటు చేయవద్దని నిరసన

- ఎన్‌హెచ్-61 పక్కన టెంట్ వేసుకొని దీక్ష
- నాలుగు గ్రామాల నుంచి తరలివచ్చిన 2 వేల మంది
- వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు..
- దాదాపు 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- స్వచ్ఛందంగా బంద్ పాటించిన దుకాణాదారులు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- రిలే నిరాహార దీక్షలకు సిద్ధమవుతున్న ప్రజలు, అన్నదాతలు
- ప్రతి గ్రామం నుంచి పది కుటుంబాలు నిత్యం పాల్గొనేలా కార్యాచరణ

దిలావర్‌పూర్, జనవరి 4 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని ప్రజలు, రైతులు బంద్‌కు పిలుపును ఇచ్చారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లో గురువారం దుకాణాలను బంద్ చేశారు. ఎటువంటి ఘటనలు జరుగలేదు. ఉదయం 9 గంటలకే గుండంపల్లి, దిలావర్‌పూర్, న్యూ లోలం గ్రామాలకు చెందిన దాదాపు 2 వేల మంది రైతులు, ప్రజలు జాతీయ రహదారి-61పైకి తరలివచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు ఎన్‌హెచ్ పక్కనే టెంటు వేసుకుని కూర్చున్నారు. పోలీసుల అనుమతితో వంటావార్పు చేసుకున్నారు. రహదారి పక్కనే కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు. ఆందోళన సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. దాదాపుగా 200 మంది బందోబస్తు నిర్వహించారు. మధ్యాహ్నం రైతులు, ప్రజలు ఇండ్లళ్లకు వెళ్లిపోయారు.

రిలే నిరహార దీక్షలకు సిద్ధమవుతున్న రైతులు

నేటి(శుక్రవారం) నుంచి పరిశ్రమ రద్దు చేసే వరకు జాతీయ రహదారి-61 పక్కన శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేసేందుకు రైతులు కార్యాచరణ చేశారు. ప్రతి గ్రామం నుంచి 10 కుటుంబాలు నిత్యం రిలే నిరాహార దీక్షలో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. కాగా, మా ప్రాణాలు తీసే ఇథనాల్ పరిశ్రమ మా గ్రామంలో వద్దని కోరుతూ ఐదేండ్ల చిన్నారి తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చింది. జాతీయ రహదారిపై కూర్చొని భోజనం చేసి నిరసన తెలిపింది. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ పొట్టగొట్టే పరిశ్రమను రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి తమ ఉద్యమానికి సంఘీభావం తెలపాలని కోరారు.

60 మందిపై కేసు..

దిలావర్‌పూర్, జనవరి 4 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ స్థలాన్ని బుధవారం ముట్టడించి.. గోడలు కూల్చివేసి, ఫర్నీచర్ ధ్వంసం చేసి, వాహనాలకు నిప్పు పెట్టిన పలువురు రైతులు, యువకులపై కేసులు నమోదు చేసినట్లు దిలావర్‌పూర్ ఎస్ఐ యాసీర్ ఆరఫత్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. కంపెనీ ఉద్యోగులు కే సందీప్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 60 మంది రైతులు, యువకులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పరిశ్రమ వద్ద విధులు నిర్వహించడానికి వచ్చిన లోకేశ్వరం మండలానికి చెందిన ఇంటెలిజెన్స్(ఎస్‌బీ) హెడ్‌కానిస్టేబుల్ లక్కపెల్లి జీవన్‌రావు, భైంసాకు(ఎస్‌బీ) కానిస్టేబుల్ జే శంకర్‌రావు సెల్ ఫోన్‌లు తీసుకుని ధ్వంసం చేసిన ఘటనలో ఇంటెలిజెన్స్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురు యువకులపై కూడా వివిధ సెక్షన్స్ కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులోనే కొందరిపై నాన్‌బెయిలబుల్ కేసులు కూడా పెట్టినట్లు తెలిపారు.

ఆదిలాబాద్ రీజియన్‌కు ఆరు బస్సులు

నిర్మల్ డిపోకు చేరిన నూతన బస్సులు

నిర్మల్ అర్బన్, జనవరి 4 : ఆదిలాబాద్ రీజియన్‌కు ఆరు నూతన బస్సులు మంజూరయ్యాయి. ఇందులో ఎక్స్‌ప్రెస్, రాజధాని బస్సులు ఉన్నాయి. 15 లక్షల కిలో మీటర్లు పూర్తి చేసినందున రీప్లేస్‌మెంట్‌లో భాగంగా ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆదిలాబాద్ రీజియన్‌లోని నిర్మల్ డిపోకు రెండు రాజధాని బస్సులు, ఒక ఎక్స్‌ప్రెస్.. ఆసిఫాబాద్ డిపోకు ఒక రాజధాని, ఒక ఎక్స్‌ప్రెస్.. మంచిర్యాల డిపోకు ఎక్స్‌ప్రెస్ బస్సును కేటాయించారు. త్వరలో ఇవి ప్రయాణికులకు సేవలు అందిస్తాయని తెలిపారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లిరూరల్, జనవరి 4 : తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం(2024-25) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ బెల్లంపల్లిసాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సందనరాజ స్వరూప ఓ ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదివిన విద్యార్థులు ఈ నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రవేశపరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని తెలిపారు.